సాక్షి
ఏలూరు
ఆదివారం । 5 । మార్చి । 2023



శ్రీవారి సన్నిధిలో హైకోర్టు జడ్జి

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని హైకోర్టు జడ్జి డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ సందర్శించారు.



నకిలీ ఫీడ్ ముఠా అరెస్ట్

కైకలూరు పరిసర ప్రాంతాల్లో నకిలీ మేత (ఫీడ్ సప్లిమెంటరీ) బస్తాలను ఆక్వా రైతులకు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో ▸

జీఐఎస్ అద్భుతం

విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) అద్భుతమని పారిశ్రామికవేత్త, రొయ్యల సాగులో జాతీయ అవార్డు గ్రహీత కేఆర్‌కే మూర్తి రాజు అన్నారు. -8లో



న్యూస్‌రీల్

జిల్లాస్థాయి స్పందన రద్దు


వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్

ఏలూరు(మెట్రో): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏలూరు కలెక్టరేట్‌లో ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ నిర్వహిస్తున్న కారణంగా ఈనెల 6న (సోమవారం) నిర్వహించాల్సిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో యథావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

శ్రీవారి క్షేత్రం కిటకిట


జంట గోపురాల వద్ద భక్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో అన్ని విభాగాలూ భక్తులతో నిండిపోయాయి. నిత్యాన్నదాన భవనం వద్ద అన్నప్రసాదం కోసం భక్తులు బారులు తీరారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

కొండచిలువల హల్‌చల్


స్థానికులు హతమార్చిన కొండచిలువలు

టి.నరసాపురం : ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదు కొండచిలువలు హల్‌చల్ చేసి స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాయి. శనివారం తిరుమలదేవిపేట పంచాయతీ పరిధిలోని మల్లప్పగూడెంలో ఎర్రకాలువ పంట బోదెల వద్ద ఐదు కొండచిలువలు కంటపడగా స్థానికులు వాటిని హతమార్చారు. వీటిలో ఒక కొండ చిలువ 13 అడుగులకు పైగా ఉంది.

కమనీయం.. కొల్లేటికోటలో కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో కీలకఘట్టం జలదుర్గ, గోకర్ణేశ్వరస్వామి వార్ల కల్యాణం వైభవోపేతంగా శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. మూడు మైళ్ల దూరంలోని గోకర్ణపురం నుంచి గోకర్ణేశ్వరస్వామిని ఊరేగింపుగా అమ్మవారి దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు. ఆలయ అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ దంపతులు కల్యాణ తంతు జరిపించారు. వేకువజాము వరకు సాగిన కల్యాణ క్రతువును భక్తులు తిలకించి తరించారు. ఆలయ ఈఓ కేవీ గోపాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉద్యోగినుల క్రీడా పోటీలు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీఎన్‌జీఓ సంఘం మహిళా విభాగం, జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగినులను ఆటల పోటీలను శనివారం నిర్వహించారు. టెన్నికాయిట్, 100 మీటర్ల స్పీడ్ వాక్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, షాట్‌పుట్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందిస్తామని ఏపీ ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు తెలిపారు.

ఉపాధిలో మెరిసి.. పురస్కారం గెలిచి..

- బుట్టాయగూడెం సచివాలయానికి జాతీయ స్థాయి అవార్డు
- ఉపాధి హామీలో నీటి సేకరణ, సంరక్షణ పనులకు గుర్తింపు
- కేంద్రమంత్రి చేతులమీదుగా అవార్డు అందుకున్న సర్పంచ్


బుట్టాయగూడెం గ్రామ సచివాలయం

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీలోని బుట్టాయగూడెం గ్రామ సచివాలయానికి జాతీయస్థాయి అవార్డు లభించింది. జలశక్తి అభియాన్‌లో ఆదర్శవంతమైన పనితీరుకు గుర్తింపు దక్కింది. గత మూడేళ్లలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నీటి సేకరణ, సంరక్షణ పనులకు గాను పురస్కారం వరించింది. ఈ మేరకు గ్రామ సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ శనివారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన స్వచ్ఛ జలశక్తి సమ్మాన్-2023 ఉమెన్స్ లీడర్‌షిప్ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పురస్కారం అందజేశారని డ్వామా పీడీ దుండి రాంబాబు తెలిపారు.

ఏఏ పనులంటే.. ఉపాధి హామీ పథకంలో చెరువు పూడిక తీత పనులు, పంట కాలువలు, పొలాలు, మొక్కల చుట్టూ కందకాలు తదితర పనులను పరిగణనలోకి తీసుకుని పురస్కారానికి ఎంపిక చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా వర్షం నీటిని ఒడిసిపట్టి వాటిని వినియోగించడమే లక్ష్యమని.. ఈ విధానంలో బుట్టాయగూడెం సచివాలయం పరిధిలో జరిగిన పనులు ఆదర్శంగా నిలిచాయని అంటున్నారు. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో నీటిపారుదల పునరుద్ధరణ పనులతో సుమారు 10 లక్షల క్యూసెక్కు మీటర్ల నీటి సామర్థ్యాన్ని సృష్టించారు. అలాగే రూ.1.30 కోట్ల వాటర్ షెడ్ల అభివృద్ధి పనులు, 4 తాగునీటి ట్యాంక్‌ల డీసిల్టింగ్ పనులు, 4 ఓవర్ హెడ్ వాటర్ స్టోరేజ్ ట్యాంక్లు, 6 పశువుల చెరువుల పనులు, 2 చెక్‌డ్యామ్‌లు తదితర పనులు జరిగాయి.


ఢిల్లీలో పురస్కారం అందుకుంటున్న సర్పంచ్ వెంకాయమ్మ

గతంలోనూ అవార్డులు

బుట్టాయగూడెం సచివాలయం 2019-20లో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ స్వశక్తి కిరణ్ పురస్కారాన్ని దక్కించుకుంది. అలాగే పంచాయతీ పలు పురస్కారాలను అందుకుంది.

కలెక్టర్ అభినందనలు

స్వచ్ఛభారత్, జలజీవన్ మిషన్, జలశక్తి అభియాన్ రంగాల్లో కృషి చేసిన వారిలో దేశవ్యాప్తంగా 36 మందికి పురస్కారాలు లభించగా రాష్ట్రం నుంచి బుట్టాయగూడెం సచివాలయానికి అవార్డు రావడం అభినందనీయమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. అవార్డు అందుకున్న సర్పంచ్ వెంకాయమ్మతోపాటు డ్వామా పీడీ దుండి రాంబాబు, ఏపీడీ ప్రఫుల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కు కలెక్టర్‌తో పాటు జేసీ అరుణ్‌బాబు, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సమష్టి కృషితోనే..



జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నీటి సేకరణ, సంరక్షణ పనులకు వచ్చిన అవార్డుతో మరింత బాధ్యత పెరిగింది. ప్రజల సహకారంతో మరిన్ని అవార్డులు పొందవచ్చు. ప్రజలు, అధికారుల సమష్టి కృషితోనే జాతీయ స్థాయి పురస్కారం సాధించాం.

– దుండి రాంబాబు, డ్వామా పీడీ, ఏలూరు

నేడు సీఎం జగన్ రాక

కలగంపూడిలో వివాహ వేడుకకు హాజరు

యలమంచిలి: ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె డాక్టర్ సింధు వివాహ వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదివారం సాయంత్రం 4 గంటలకు మండలంలోని కలగంపూడి గ్రామానికి రానున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ప్రత్యేక ట్రయిల్ రన్ నిర్వహించారు. కాజ నరేంద్రస్వామి దేవస్థానం భూముల్లో హెలీప్యాడ్ ఏర్పాటుచేశారు. అక్కడ నుంచి సీఎం జగన్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన వివాహ వేదిక వద్దకు ప్రత్యేక వాహనంలో చేరుకుంటారు. ఈ మేరకు ఏర్పాట్లను కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, ఇన్‌చార్జి జేసీ ఎం.సూర్యతేజ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటన విజయవంతానికి అధికారులంతా కృషి చేయాలని, చిన్నపాటి పొరపాటుకు కూడా తావివ్వొద్దన్నారు. ఉదయం హెలికాప్టర్ ట్రయిల్‌రన్, సాయంత్రం వాహనాల ట్రయిల్ రన్ నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

పర్యటన సాగేదిలా..

- మధ్యాహ్నం 3.40 గంటలకు తాడేపల్లిలో ఇంటి నుంచి ముఖ్యమంత్రి బయలుదేరతారు.
- మధ్యాహ్నం 3.45 గంటలకు తాడేపల్లిలో హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- సాయంత్రం 4.20 గంటలకు హెలికాప్టర్‌లో కలగంపూడి వస్తారు.
- సాయంత్రం 4.20 నుంచి 4.30 వరకు ప్రజలతో మాట్లాడతారు.


పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, కలెక్టర్ ప్రశాంతి

- సాయంత్రం 4.35 గంటలకు వివాహ వేదికకు చేరుకుంటారు.
- 4.50 గంటల వరకు వివాహ వేదిక వద్ద ఉండి నూతన దంపతులను ఆశీర్వదిస్తారు.
- సాయంత్రం 4.55 గంటలకు తిరిగి కలగంపూడిలో హెలీప్యాడ్ ప్రాంతానికి చేరుకుంటారు.
- సాయంత్రం 5.10 గంటల వరకు అక్కడ స్థానిక నాయకులతో మాట్లాడతారు.
- సాయంత్రం 5.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి తాడేపల్లి చేరుకుంటారు.

ట్రాఫిక్ మళ్లింపు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా దిగమర్రు-చించినాడ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను మళ్లించారు. పాలకొల్లు వైపు వెళ్లే వాహనాలను చించినాడ నుంచి మేడపాడు మీదుగా పాలకొల్లు చేరేలా, నరసాపురం వైపు వెళ్లే వాహనాలను చించినాడ, ఏనుగువానిలంక, నవరసపురం మీదుగా నరసాపురం చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.

కళాశాల లాగిన్‌లో ఇంటర్ హాల్‌టికెట్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15 నుంచి జరుగనున్న ఇంటర్మీడియెట్ థియరీ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లను ఆయా కళాశాలల లాగిన్‌లో పొందుపరిచినట్టు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 106 కేంద్రాలను సిద్ధం చేశామని, పరీక్షలు వచ్చేనెల 4 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. 33,874 మంది ప్రథమ సంవత్సరం, 38,174 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహిస్తామని, ఒక్క క్షణం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించరని పేర్కొన్నారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగాయని తెలిపారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి మంగాకుమారి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి మంగాకుమారి

ఏలూరు(మెట్రో): బాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రత్యేక పోలీస్, బాలల సంక్షేమ, ప్రత్యేక బాలల న్యాయమూర్తుల కమిటీలపై ఉందని మొదటి అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం ప్రత్యేక బాలల పోలీస్ యూనిట్, ప్రత్యేక బాలల న్యాయమూర్తుల విభాగం, బాలల సంక్షేమ అధికారులు, సంబంధిత అధికారులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంగాకుమారి మాట్లాడుతూ సరైన సంరక్షణ, అభివృద్ధి, చికిత్స, సాంఘిక పునఃనిర్మాణం ద్వారా పిల్లల ప్రాథమిక అవసరాలు తీర్చడం కోసం పోక్సో చట్టం రూపొందించారన్నారు.

ప్రత్యేక బాధ్యతగా..

పోక్సో స్పెషల్ జడ్జి ఎస్.ఉమాసునంద మాట్లాడుతూ పిల్లల సంరక్షణ ప్రత్యేక బాధ్యతగా చేపట్టాలన్నారు. ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో పోలీసులు పిల్లల సంరక్షణ చేపట్టాలన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్‌కుమారి మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాలు పెంచుకోవడానికి శిక్షణ దోహదపడుతుందన్నారు. అనంతరం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ సెక్రటరీ సుబ్బారావు, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ బి.రెబ్కారాణి, ఇంప్లిమెంటేషన్ జేజే యాక్ట్ డీపీఓ జె.దుర్గాప్రసాద్, మాస్టర్ ట్రైనర్ తెగిరిపల్లి సుబ్బారావు, డీఎస్పీ పైడేశ్వరరావు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌లో మెరికలు

- రాణిస్తున్న 'కస్తూరిబా' బాలికలు
- జాతీయస్థాయిలో ప్రతిభ
- రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ద్వారా నజరానా


పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు


ఏలూరు కస్తూరిబా పాఠశాలలో సాధన చేస్తున్న బాలికలు

ఏలూరు రూరల్: ఏలూరులో కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థినులు బాస్కెట్‌బాల్ క్రీడలో రాణిస్తున్నారు. స్కూల్, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో వరుస విజయాలు సాధిస్తూ భళా అనిపిస్తున్నారు. పాఠశాల పీడీ కె.మురళీకృష్ణ శిక్షణలో ఆటలో మెరికల్లా మారారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఏటా పాఠశాలలో వేసవి ప్రత్యేక శిబిరం నిర్వహిస్తోంది. అలాగే ఇక్కడ విద్యార్థినుల ప్రతిభను గుర్తించి రూ.70 వేల నగదు ప్రోత్సాహకం కూడా అందించారు. దాతలు దుస్తులు, బూట్లు అందించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు.

2018లో కోర్టు ఏర్పాటు : పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో పీడీ మురళీకృష్ణ 2018లో పాఠశాలలో బాస్కెట్‌బాల్ కోర్టును నిర్మించారు. తర్వాత నగరపాలక సంస్థ అధికారులు కోర్టుకు ఫ్లోరింగ్ చేయించారు. ఇక్కడ రోజూ ప్రత్యేక శిక్షణతో పాటు వేసవిలో శిబిరాలు నిర్వహించడంతో పిల్లల్లో బాస్కెట్‌బాల్‌పై ఆసక్తి పెరిగింది. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు గ్రిక్స్, స్కూల్‌గేమ్స్, అసోసియేషన్ నిర్వహించే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పోటీల్లో సత్తాచాటుతున్నారు.

పతకాల పరంపర

- గతనెలలో నూజివీడులో జరిగిన అండర్-14 ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తాచాటి ఎ.రుత్విక, జి.పూజిత, నందిని రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించారు.
- గత నెలలో విజయవాడలో జరిగిన అండర్-17 అంతర్ జిల్లాల పోటీల్లో పి.జయశ్రీ, ఆర్.రేణుక రాష్ట్ర జట్టుకు ఎంపికై జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు.
- పాఠశాల విద్యార్థినులతో పాటు పూర్వ విద్యార్థినులతో కూడిన జట్టు 2020లో నూజివీడులో జరిగిన బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా నిలిచింది.
- 2018లో రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్స్లుగా నిలిచిన జిల్లా జట్టులో 8 మంది కస్తూరిబా విద్యార్థినులు ఉండటం విశేషం.
- అలాగే మురళీకృష్ణ వద్ద శిక్షణ పొందిన వి.చంద్రలేఖ, బి.లీలావతి, బి.భవానిదేవి, ఎల్.లీలాసరోజనితో పాటు పలువురు బాలికలు జాతీయస్థాయి పోటీల్లో తలపడ్డారు.

క్రీడల్లో ప్రోత్సహిస్తున్నాం



మా పాఠశాల పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నాం. ఎక్కువ మంది బాస్కెట్‌బాల్‌లో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. ఆఫీస్ గది నిండా కప్పులే. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటూ మిగతా పిల్లల్లో స్ఫూర్తి నింపడం సంతోషంగా ఉంది.

– జి.సునీత, హెచ్‌ఎం

జాతీయ స్థాయిలో..



బాస్కెట్‌బాల్ అంటే నాకెంతో ఇష్టం. అమ్మానాన్న కూడా ప్రోత్సహిస్తున్నారు. అందుకే సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో చేరాను. రోజూ ఉదయం, సాయంత్రం వచ్చి ఇక్కడ సాధన చేస్తున్నాను. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం నాకు వచ్చింది. క్రీడలో మరింత రాణించేలా శ్రమిస్తున్నా.

– ఎస్ రేణుకదేవి, 9వ తరగతి

సీనియర్ల ఆట చూసి..



నాకు బాస్కెట్‌బాల్ డ్రిబ్లింగ్, షూటింగ్ చేయడం అంటే చాలా ఇష్టం. ఫాస్ట్‌గా పరుగెత్తి బాస్కెట్ వేస్తే చాలా థ్రిల్‌గా ఉంటుంది. నా సీనియర్ ఆట చూసి నేను బాస్కెట్‌బాల్ నేర్చుకోవాలి అనుకున్నా. మంచి క్రీడాకారిణిగా రాణించడమే నా లక్ష్యం. జిల్లా, రాష్ట్ర జట్టులో చోటు సంపాదించా.

– పి.జయశ్రీ, 10వ తరగతి

దాతల సహకారం



బాస్కెట్‌బాల్ కోర్టు నిర్మాణం చేపట్టిన నాటి నుంచి దాతల సహకారం మరువలేం. క్రీడా దుస్తులు, షూలు అందిస్తూ చేదోడుగా ఉంటున్నారు. హెచ్‌ఎం సునీతతో పాటు పీడీ ప్రసన్న, పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు వెళుతున్నారు.

– కె.మురళీకృష్ణ, పీడీ

'చింతలపూడి' పనుల పరిశీలన

చాట్రాయి: చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. చీపురుగూడెం, పిట్లవారిగూడెం గ్రామాల్లో పనులను శనివారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం రూ.3,800 కోట్లు ఖర్చు పెట్టిందని, మరో రూ.1,000 కోట్లు ఖర్చు చేస్తే పనులు పూర్తవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టుకి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసిన రూ.2,900 కోట్లను ఇవ్వలేదని విమర్శించారు. కేంద్రం కర్ణాటకలో వివాదస్పద ప్రాజెక్టుకి నిధులు కేటాయించి పోలవరాన్ని ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. వచ్చే బడ్జెట్‌లో 10 శాతం ఇరిగేషన్‌కి నిధులు కేటాయించి పెండింగ్ పనులను పూర్తి చేయడంతో పాటు రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ జెల్లీ విల్సన్, రాష్ట్ర నాయకులు డి.ప్రభాకర్, చలసాని వెంకట రామారావు, జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ఏప్రిల్ 7 నుంచి పాలకొల్లులో నాటిక పోటీలు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు కళా పరిషత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో పట్టణంలో జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు కళాపరిషత్ అధ్యక్షులు కేవీ కృష్ణవర్మ శని వారం చెప్పారు. పోటీలకు ఏ డు నాటికలు ఎంపిక చేశామన్నారు. 7న కొత్త పరిమళం, నాన్నా నేనొచ్చేస్తా, 8న ప్రక్షాళన, కెరటాలు, మృత్యుపత్రం, 9న వెండి అంచులు, అతీతం నాటికలు ప్రదర్శించనున్న ట్లు వివరించారు. మానాపురం స త్యనారాయణ, మేడికొండ శ్రీనివాస చౌదరి, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త, కేఎస్‌పీఎస్ వర్మ, పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ అద్భుతం

- రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం
- కార్పొరేట్ కంపెనీల దిగ్గజాల రాకతో పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం
- ఆకివీడు పారిశ్రామికవేత కేఆర్‌కే మూర్తిరాజు వెల్లడి



సమ్మిట్‌లో పాల్గొన్న ఆకివీడు పారిశ్రామికవేత్త, రొయ్యల పెంపకంలో జాతీయ అవార్డు గ్రహీత కేఆర్‌కే మూర్తిరాజు

ఆకివీడు: రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్టణంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ దేశంలోనే చరిత్రాత్మకమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సదస్సు అద్భుతమని స్థానిక పారిశ్రామికవేత్త, రొయ్యల సాగులో జాతీయ అవార్డు గ్రహీత కేఆర్‌కే మూర్తి రాజు అన్నారు. సదస్సులో పాల్గొని తిరిగి వచ్చిన ఆయన శని వారం ‘సాక్షి’తో మాట్లాడుతూ అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలు ఇచ్చిన హామీలు తు.చ.తప్పకుండా అమలు అవుతాయని గట్టి నమ్మకం ఉందన్నారు. రాష్ట్రంలో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు కచ్చితంగా వస్తాయని సదస్సు చూసిన వారు నమ్మి తీరుతారన్నారు. రాష్ట్రంలోని తీర ప్రాంతాలు, విమాన సౌకర్యం, రహదారులు, వనరులు ఉన్న ప్రాంతాలు పారిశ్రామిక వేత్తలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్పొరేట్ రంగంతో పాటు, ప్రభుత్వ రంగంలోని పలు సంస్థలు కూడా ముందుకు వచ్చి పరిశ్రమల స్థాపనకు హామీలివ్వడంతో రాష్ట్రం పారిశ్రామికంగా ప్రగతి సాధిస్తుందని చెప్పారు. అదానీ, అంబానీ, దాల్మియా, బంజాకా వంటి పేరొందిన ఎన్నో కార్పొరేట్ దిగ్గజాలు వైజాగ్‌లో అడుగుపెట్టడం పరిశ్రమల ఏర్పాటుకు ఆరంభ సూచికమన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రగతిపథంలో పయనిస్తుందని మూర్తి రాజు చెప్పారు. అరటి, కొబ్బరి, వరి, ఆక్వా, చేపల ఉత్పత్తి వంటి పంటలు దేశంలోనే మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్ని అనుసంధానం చేస్తూ పరిశ్రమల స్థాపన జరగాలన్నారు. పరిశ్రమల విస్తరణ పల్లెలకు చేరాలని ఆయన సూచించారు. ప్రభుత్వం గ్రామీణ నైపుణ్యం పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు. హైజనిక్ ఉత్పత్తులకు స్థానం కల్పించాలని సూచించారు. పారిశ్రామికంగా ఉప ఉత్పత్తుల్ని, విడి భాగాల్ని గ్రామీణ ప్రాంతాలకు చేరే విధంగా కృషి చేయాలని మూర్తి రాజు కోరారు. పరిశ్రమల కేంద్రీకృతంతో తక్కువ ధరలకు ప్రజలకు వస్తువులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. విద్యా వంతులైన యువకులకు ఉపాధి అవకాశాలు మెండుగా కలుగుతాయన్నారు. గ్లోబల్ సమ్మిట్‌ను రాజకీయం చేయకుండా ప్రతిపక్షాలు కూడా సహకరిస్తు రాష్ట్రం పారిశ్రామికంగా కూడా ప్రగతిపథంలో పయనించి దేశంలోనే అగ్ర రాష్ట్రంగా నిలబడుతుందని మూర్తిరాజు ఆకాంక్షించారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయంలో జరిగిన పారిశ్రామిక సదస్సు విజయవంతంగా జరగలేదని చెప్పారు. తదనంతరం కూడా పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందుకు రాలేదన్నారు. రాష్ట్రంలో అపారమైన వనరుల్ని సద్వినియోగ పరచుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సమ్మిట్ ప్రతిష్టాత్మకమైనదిగా భావించాలని సూచించారు.

నేడు ఏలూరులో ఫెన్సింగ్ జిల్లా జట్ల ఎంపిక

సాక్షి, భీమవరం: కాకినాడ లేడీస్ క్లబ్‌లోని ద్రోణ అకాడమీలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సీనియర్ ఫెన్సింగ్ జట్టు ఎంపికను ఆదివారం ఏలూరులో నిర్వహిస్తున్నట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ చెప్పారు. ఏలూరులోని కస్తూరిబా మున్సిపల్ పాఠశాలలో ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి సెలెక్షన్స్ ఫెన్సింగ్ కోచ్ ఎన్‌సీహెచ్ రామ్ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనే ఫెన్సింగ్ క్రీడాకారుడు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం 63042 52121, 83330 32217 సెల్ నంబర్లలో సంప్రదించాలని కృష్ణమోహన్ కోరారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షకు 8,748 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న ప్రయోగ పరీక్షల్లో శనివారం 8,748 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులో జరిగిన పరీక్షకు 87 కేంద్రాల్లో 7,154 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6,999 మంది హాజరు కాగా, 155 మంది గైర్హాజరయ్యారు. అలాగే 28 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 1,931 మంది హాజరు కావాల్సి ఉండగా 1,749 మంది హాజరు కాగా, 182 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే చంద్రశేఖరబాబు చెప్పారు.

గడపగడపకు సంక్షేమం



ముసునూరు : బలివే గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



కైకలూరు (కలిదిండి) : కలిదిండి మండలం పెదలంక గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ విద్యార్థినిని ఎలా చదువుతున్నావంటూ అడుగుతున్న కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు

ఆక్వా నకిలీ ఫీడ్ విక్రయ ముఠా అరెస్టు



పట్టుబడిన ముఠాను చూపుతున్న సీఐ వైవీవీఎల్ నాయుడు, ఎస్‌ఐ మణికుమార్

కై కలూరు (కలిదిండి): ఆక్వా రంగాన్ని నకిలీల బెడద వదలడం లేదు. ప్రముఖ కంపెనీలను పోలిన నకిలీ మేత (ఫీడ్ సప్లిమెంటరీ) బస్తాలను ఆక్వా రైతులకు అంటగడుతూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఇటువంటి మోసాన్ని కలిదిండి పోలీసులు ఛేదించారు. కేసు వివరాలను కై కలూరు సర్కిల్ సీఐ వైవీవీఎల్.నాయుడు, కలిదిండి ఎస్‌ఐ మణికుమార్‌లు కలిదిండి పోలీసుస్టేషన్‌లో శనివారం విలేకరులకు వివరించారు. విశాఖపట్నంలో సీ బాస్ బయో రెమిడీస్ కంపెనీ ఫినామిన్ ఆక్వా మినరల్స్ మేతలను రొయ్యల రైతులకు డీలర్ల ద్వారా సరఫరా చేస్తోంది. కైకలూరు పరిసర ప్రాంతాల్లో ఈ కంపెనీ మేతను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన సయ్యపురెడ్డి మునీంద్ర, గుంటూరు జిల్లా, సీతానగరానికి చెందిన చిట్టిప్రోలు వెంకట కోటేశ్వరరావుతో అచ్చుగుద్దినట్లు ఉండే సీ బాస్ బయో రెమిడీస్ సంచులను తయారు చేయించాడు. అక్కడ నుంచి పల్నాడు జిల్లా గామాలపాడుకు చెందిన మంచి శ్రీనివాసరావు ఈ సంచులలో సున్నం నింపి భీమవరంలో మునీంద్ర గోడౌన్‌లో నిల్వ చేయించాడు. కోరుకోల్లు గ్రామానికి చెందిన కేశిరెడ్డి వెంకట బలరామకృష్ణ సమీప రైతులకు వీటిని విక్రయిస్తాడు. వీటి సరఫరా బాధ్యతలను పల్నాడు జిల్లా నడికుడి, దాచేపల్లి గ్రామాలకు చెందిన వ్యాన్ యజమాని షేక్ అబ్బార్ అలీ, డ్రైవర్ షేక్ మహమ్మద్ చూస్తారు. ఇలా సాగుతుండగా ఫిబ్రవరి 5న ముదినేపల్లి మండలం ఈడేపల్లి గ్రామానికి చెందిన సీ బాస్ బయో రెమిడీస్ కంపెనీ రికవరీ మేనేజర్ బండి ఫణికుమార్ నకిలీ మేతల విక్రయాలపై కలిదిండి పోలీసులకు ఫిర్యాదు చేయగా నకిలీ రాకెట్ ముఠా పోలీసులకు చిక్కింది. కేసు నమోదు చేసి వాహనాలు, మేతలను సీజ్ చేశారు.

సోము వీర్రాజుపై అట్రాసిటీ కేసు నమోదుకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని బహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఏలూరులో బహుజన సేన సమితి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ ఇటీవల మంగళగిరిలోని చినకాకాని ప్రాంతంలో గొల్ల వరప్రసాద్ అనే దళితుడి భూమిని కబ్జా చేయడానికి తుపాకీతో బెదిరింపులకు పాల్పడిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, మరికొంతమందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ తక్షణం స్పందించాలన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే గుంటూరు ఎస్పీ ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా కార్యదర్శి లక్క పాము చంటి, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

లింగపాలెం: చింతలపూడి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ సుంకర సాయిస్వరూప్, ఎస్సై దుర్గా ప్రసాద్ శనివారం యడవల్లి గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తెలంగాణ మద్యం విక్రయిస్తున్న చేస్తున్న గ్రామానికి చెందిన ఈడా చంద్రారావును అరెస్ట్ చేసి, అతని నుంచి తెలంగాణకు చెందిన 88 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం విలువ రూ.15 వేలు ఉంటుందని సీఐ తెలిపారు. తెలంగాణ మద్యంను సప్లయ్ చేస్తున్న యర్రంపల్లి గ్రామానికి చెందిన వీరంకి సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.